www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 31 అక్టోబర్ 2025
5
ఏలూరు



రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి

బుట్టాయగూడెం: రంపచోడవరం, చింతూరు డివిజన్, పోలవరం నియోజకవర్గం కలిపి ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరరావు కోరారు. మండలంలోని రెడ్డిగణపవరంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు రంపచోడవరానికి 180 కిలోమీటర్లు దూరం వస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని రంపచోడవరం, చింతూరు డివిజన్, పోలవరం నియోజకవర్గం కలిపి రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తామని ఎన్నికల ముందు వాగ్దానం చేశారని గుర్తు చేశారు. రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని ఏజెన్సీ ప్రాంత గిరిజనులు కోరుకుంటున్నారన్నారు. వారి అభిప్రాయాలు దృష్టిలో పెట్టుకుని రంపచోడవరం కేంద్రంగా మరో గిరిజన జిల్లాను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గిరిజనులకు ప్రత్యేక జిల్లా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కోర్స జలపాలు, వెట్టి వీరయ్య, కారం సూర్యచంద్రం పాల్గొన్నారు.

సిపిఎం సీనియర్ నేత
చింతకాయల బాబూరావు కన్నుమూత





బాబూరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంతెన సీతారాం

- నివాళులర్పించిన ఎంఎల్ఏ బొలిశెట్టి శ్రీనివాస్, ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, సిపిఎం, యుటిఎఫ్, ప్రజాసంఘాల రాష్ట్ర, జిల్లా నేతలు
- కార్మికోద్యమానికి సుదీర్ఘకాలం నాయకత్వం వహించిన బాబూరావు
- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బాధ్యతల్లో బాబూరావు భార్య శ్రీదేవి
- భౌతికకాయంపై ఎర్ర జెండా కప్పిన సిపిఎం సీనియర్ నేత మంతెన సీతారాం
- ప్రజా ఉద్యమాలకు బాబూరావు మృతి తీరని లోటు
- నేడు భౌతికకాయాన్ని ఆశ్రం మెడికల్ కాలేజీకి అప్పగింత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, కార్మికోద్యమ నేత చింతకాయల బాబూరావు ఆకస్మికంగా గుండె పోటుతో గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. అనారోగ్యంగా ఉండటంతో రాజమండ్రి ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లగా అక్కడ గుండెపోటు రావడంతో ఆకస్మికంగా మరణించారు. ఆయన మరణ వార్త జిల్లాలోని సిపిఎం, సిఐటియు శ్రేణులను, కార్మిక వర్గాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన భౌతికకాయాన్ని రాజమండ్రి నుంచి స్థానిక సిపిఎం కార్యాలయానికి తరలించారు. అక్కడ పార్టీ శ్రేణులు, కార్మికులు, రాష్ట్ర, జిల్లా నేతల సందర్శనార్థం ఉంచారు.

బాబూరావు 1962 జూన్ 4న తాడేపల్లిగూడెంలో మధ్యతరగతి కుటుంబంలో పుట్టి ఇంటర్ వరకు చదువుకున్నారు. బిఏ, ఎంఏ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో పూర్తి చేశారు. భార్య శ్రీదేవి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బాధ్యతల్లో ఉన్నారు, ఆయనకు కుమారుడు సిద్ధార్థ ఉన్నారు. గణపవరం మండలంలో రైస్‌మిల్లు కార్మికుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి అనేక సంఘాలను నిర్మించారు. సిపిఎం పూర్తికాలం కార్యకర్తగా వచ్చి తాడేపల్లిగూడెంలో కార్మికోద్యమ నిర్మాణంలో ఎనలేని కృషి చేశారు. జైలు జీవితాన్ని కూడా అనుభవించారు. తుదిశ్వాస విడిచే వరకు ఎర్రజెండా నీడలో ఉన్నారు. సిపిఎం తాడేపల్లి గూడెం తాలూకా తొలి కార్యదర్శిగా పనిచేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షులుగా, సిపిఎం ఉమ్మడిపశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా, అప్‌ల్యాండ్, ఏలూరు జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యులుగా పనిచేశారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో సొంత జిల్లా పశ్చిమగోదావరి జిల్లా కు వచ్చారు. రైతు సంఘం జిల్లా నేతగా అనేక పోరాటాల్లో భాగస్వామ్యం అవుతూ ప్రస్తుతం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుని బాధ్యతల్లో ఉన్నారు.

సిపిఎం కార్యాలయంలో ఉన్న బాబూరావు భౌతిక కాయానికి తొలుత సిపిఎం రాష్ట్ర సీనియర్ నేత మంతెన సీతారాం పార్టీ జెండా అరుణపతాకాన్ని కప్పి నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమా మహేశ్వరరావు, బి.బలరాం, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.సుబ్బారావు, పి.అజయ్ కుమార్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు నరసింహారావు, ధనలక్ష్మి, యూటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శి జె.ఎన్.వి. గోపాలన్, బాబూరావు భార్య శ్రీదేవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, కర్రి నాగేశ్వరరావు, పివి ప్రతాప్, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిల్లి రామకృష్ణ, ఏలూరు నగర కార్యదర్శి పంపన రవికుమార్, సిఐటియు ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, సిపిఎం తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్ కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.తులసి, సిఐటియు ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల ప్రధాన కార్యదర్శులు డి.ఎన్.వి.డి ప్రసాద్, కె.రాజరామోహన్ రాయ్, బి.పవన్, జిల్లా నాయకులు ఎ.అజయ కుమారి, ఎం.సుందర్ బాబు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.అరుణకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి రామభద్రం, రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, యుటిఎఫ్ జిల్లా సహా అధ్యక్షులు నాగ శిరోమణి, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారపల్లి రమణారావు, వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ ఐద్వా జిల్లా కార్యదర్శులు జక్కంశెట్టి సత్యనారాయణ, కె.క్రాంతి బాబు, పొగాకు పూర్ణ, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు దాసం వరప్రసాద్, యుటిఎఫ్ జిల్లా నాయకులు భవానీ ప్రసాద్, వివిధ సంఘాల నేతలు కోరంగి లక్ష్మణ్, మండల నాగేశ్వరరావు, డి.సోమసుందర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొర్రెల శ్రీధర్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు చింతపల్లి సుందర్య, ఎల్.ఐ.సి ఏజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రవి కిషోర్, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి, డి.వై.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షులు ఎస్.వి.ఎస్.శర్మ. ఉమ్మడి జిల్లా కార్యదర్శి గేదెల శివకుమార్ తదితరులు పూలదండలతో బాబూరావు భౌతికకాయానికి ఘన నివాళులర్పించారు.



బాబూరావు భౌతికకాయానికి నివాళులర్పించిన ఉమామహేశ్వరరావు



బాబూరావు భౌతికకాయానికి పూలమాల వేస్తున్న బలరాం

నివాళులర్పించిన ఎంఎల్ఏ బొలిశెట్టి, ఎంఎల్‌సి గోపీమూర్తి

చింతకాయల బాబూరావు భౌతికకాయాన్ని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాబూరావు భార్య శ్రీదేవిని ఓదార్చారు.

సంతాపం తెలిపిన ప్రముఖులు..

చింతకాయల బాబూరావు మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర సీనియర్ నేత, మాజీ ఎంపీ పి.మధు, కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, కె.లోకనాథం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కెలో సురేంద్ర, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, విజయనగరం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డి.వి కృష్ణారావు, నంద్యాల జిల్లా కార్యదర్శి రమేష్, గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి కారెం వెంకటేశ్వరరావు, వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య, కృష్ణా జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి గోవిందరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు జయరాం తదితరులు సంతాపం తెలిపారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేసిన పోరాటయోధుడు, కార్మికుల ఆశాజ్యోతి చింతకాయల బాబూరావు మరణం కార్మిక లోకానికి తీరనిలోటని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో గురువారం బాబూరావు భౌతికకాయానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ ఆరు సంవత్సరాల క్రితం బాబూరావుకు గుండెకు బైపాస్ ఆపరేషన్ చేశారని, అప్పటి నుంచి కొంత అనారోగ్యంగా ఉన్నారని అన్నారు. ఈ రోజు రాజమండ్రి ఆసుపత్రిలో ఆయన గుండెపోటుతో మరణించారని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని తెలిపారు. బాబూరావు స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని ఆయన అన్నారు.



బాబూరావు భౌతికకాయానికి పూలమాల వేస్తున్న రవి



బాబూరావు భౌతికకాయం వద్ద జోహార్లు అర్పిస్తున్న గోపీమూర్తి



బాబూరావు భౌతికకాయానికి పూలమాల వేస్తున్న ఎంఎల్ఏ

జిల్లాల పునర్వ్యవస్థీకరణ సాగేనా

- 'ఒక నియోజకవర్గం అంతా ఒకే రెవెన్యూ డివిజన్‌లోకి' అంటూ రెవెన్యూ మంత్రి ప్రకటనతో రెండు జిల్లాల్లో కలకలం
- ద్వారకాతిరుమల, గణపవరం మండలాల రూటెటు అంటూ సర్వత్రా చర్చ

ప్రజాశక్తి - పశ్చిమ డెస్క్

జిల్లాల పునర్వ్యవస్థీకరణ పునర్విభజన సందర్భంగా తలెత్తిన సమస్యలను పరిష్కరిస్తుందా, లేక కొత్త సమస్యలు తెస్తుందా అనే చర్చ రెండు జిల్లాల్లో పెద్దఎత్తున సాగుతోంది. ఒక నియోజకవర్గం అంతా ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలనేది తమ అభిమతమని మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చేసిన వ్యాఖ్యలే కారణం.

జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఏలూరు జిల్లాలోని నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల్లో కలపాలనేది అక్కడి ప్రజాప్రతినిధులు, ప్రజల ఆకాంక్షగా వివిధ రూపాల్లో ఇప్పటికే జిల్లా అధికారులకు, మంత్రివర్గ ఉపసంఘ సభ్యులకు సైతం వినతులిచ్చారు. అదే క్రమంలో పశ్చిమగోదావరి జిల్లాలో భాగంగా ఉన్న గణపవరం మండలాన్ని అక్కడే కొనసాగించాలని, ఏలూరు జిల్లాలో కలిపే ఆలోచన సరికాదని అక్కడి ప్రజలు ఆందోళనలు నిర్వహించారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రం భీమవరం నుంచి నరసాపురానికి మార్చాలనే డిమాండ్ సైతం తెరపైకొచ్చింది.

ఇక పోలవరం జిల్లా ఏర్పాటుకు సంబంధించి గతంలో చంద్రబాబు హామీ ఇచ్చినా పెద్దగా చర్చ లేకపోవడంతో అక్కడి ప్రజలు సైతం రంపచోడవరం నియోజకవర్గం, పోలవరం నియోజకవర్గాలను కలిపి ఒక జిల్లాగా ఏర్పాటు చేయాలనేది అక్కడి ప్రజల డిమాండ్. ఈ డిమాండ్లపై ఇప్పటికే ఆయా ప్రాంతాల ప్రజలు తమ వినతులు అందించారు. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల్లో కలిపేందుకు ప్రభుత్వం కూడా సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న చింతలపూడి, లింగపాలెం మండలాలను జంగారెడ్డిగూడెం, లేదా పూర్వం తరహాలో ఏలూరు రెవెన్యూ డివిజన్‌లోగాని కలుపుతారనే చర్చ సాగుతోంది. ఈ క్రమంలో రెవెన్యూ మంత్రి ప్రకటన అనేక చర్చలకు వేదికైంది. నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలిపితే కచ్చితంగా ఆ రెవెన్యూ డివిజన్ పరిధిలోని చింతలపూడి, లింగపాలెం మండలాలను జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్‌లోనే కలపాల్సి ఉంది. అదే జరిగితే జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్ 12 మండలాలతో అతిపెద్ద డివిజన్‌గా రూపాంతరం చెందనుంది. ఏజెన్సీ ప్రాంతం కావడంతో అక్కడి అధికారులకు పరిపాలనా వ్యవహారాలు కష్టతరమయ్యే అవకాశం ఉంది. అదే సందర్భంలో ఇప్పటికే చింతలపూడి, లింగపాలెం మండలాల ప్రజలు సైతం తమను ఏలూరు రెవెన్యూ డివిజన్‌లో కలపాలని కోరుతున్నారు.

ఇక తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న గోపాలపురం నియోజకవర్గంలో ఉన్న ద్వారకాతిరుమల మండలం ప్రసిద్ధ క్షేత్రం కావడంతో అప్పటి ప్రజాప్రతినిధులు, నేతల కోరిక మేరకు ఏలూరు జిల్లాలోనే ఉంచి, జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్‌లో చేర్చారు. ఈ క్రమంలో నియోజకవర్గమంతా ఒకే రెవెన్యూ డివిజన్‌లో ఉండాలంటే కచ్చితంగా ద్వారకాతిరుమలను ఏలూరు జిల్లా నుంచి వేరు చేయడం, లేదా గోపాలపురం నియోజకవర్గంలోని గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల మండలాలను ఏలూరు జిల్లాలో కలపడం గానీ చేయాలి. ఇది మరికొన్ని సమస్యలను తెరపైకి తీసుకొచ్చే పరిస్థితి కన్పిస్తోంది.

ఇక ఉంగుటూరు నియోజకవర్గంలోని గణపవరం మండలం పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం రెవెన్యూ డివిజన్‌లో ఉంది. మిగిలిన ఉంగుటూరు నియోజకవర్గం అంతా ఏలూరు జిల్లాలోని ఏలూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉంది. తొలుత గణపవరం మండలం కూడా ఏలూరు జిల్లా పరిధిలోనే ఉన్నా అక్కడి నేతలు, ప్రజాప్రతినిధులు, ప్రజల కోరిక మేరకు తర్వాత పశ్చిమగోదావరి జిల్లాలో చేర్చారు. రెవెన్యూ మంత్రి ప్రకటనతో గణపవరం మండలాలవాసుల ఆకాంక్షలకు భిన్నంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక పోలవరం, రంపచోడవరం నియోజకవర్గాలతో జిల్లా ఏర్పాటు చేస్తే నిర్వాసితులంతా ఒకే జిల్లా పరిధిలోకి వస్తారు. తద్వారా నిర్వాసితుల సమస్యలపై పాలనా యంత్రాంగం దృష్టి పెట్టడానికి, పునరావాసంలో సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు తరాలకు ఇబ్బంది లేకుండా ఉంటుందనే వాదన విన్పిస్తోంది. మొత్తానికి కూటమి ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సాగి సమస్యలను పరిష్కరిస్తుందా, లేక కొత్త సమస్యలను తెరపైకి తీసుకొచ్చి ప్రజాందోళనకు కారణమవుతుందా అనేది వేచిచూడాలి.

చినుకు పడితే కునుకు కరువు

- పశ్చిమలో శిథిలావస్థలో ప్రభుత్వ వసతి గృహాలు
- కోరుకొల్లు ఎస్‌సి బాలికల హాస్టల్ పరిస్థితి ఘోరం
- విద్యార్థినులు నిద్రిస్తున్న చోట వర్షం కురుస్తున్నా పట్టించుకోని అధికారులు
- బిక్కుబిక్కుమంటూ రాత్రి వేళల్లో జాగారమే
- పేద విద్యార్థుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు
- అమలుకు నోచుకోని టిడిపి కూటమి ప్రభుత్వ హామీలు

వాళ్లంతా రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం నుంచి వచ్చిన నిరుపేదల పిల్లలు. కూటి కోసం కోటి విద్యలు అంటారు. అటువంటి విద్య కోసం వారు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. ప్రభుత్వ వసతి గృహాల్లో వసతి పొందుతూ విద్య అభ్యశిస్తున్న పేద విద్యార్థులకు కంటి నిండా కునుకు కరువైంది. వసతిగృహాలు శిథిలావస్థలో ఉండటంతో శ్లాబ్ లీకై చినుకు పడితే కునుకు కరువవుతున్న పరిస్థితి ఉది. ఈ నేపథ్యంలో రాత్రి అంతా జాగారం చేస్తూ విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారు.



విద్యార్థులు పడుకునే చోట పడుతున్న వర్షం

ప్రజాశక్తి - భీమవరం

పేద విద్యార్థులు చదువుకునే వసతి గృహాల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కనీస వసతులు లేక విద్యార్థులు నానావస్థలు పడుతున్నారు. హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరడం, డ్రెయినేజీ, మరుగుదొడ్ల అధ్వానంగా ఉండట, శ్లాబ్‌లు లీక్ కావడం వంటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న కోరుకొల్లు ఎస్‌సి బాలికల వసతిగృహాన్ని ప్రజాశక్తి పరిశీలించింది. ఈ వసతి గృహం భవనాన్ని 2006లో అప్పటి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, భీమవరం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ప్రారంభోత్సవం చేశారు. భవన నిర్మాణం చేపట్టి సుమారు 19 ఏళ్లవుతోంది. అయితే భవనం నేడు శిథిలావస్థకు చేరుకుంది. భవనం శ్లాబ్ మొత్తం లీకవుతున్న పరిస్థితి ఉంది. 24 మంది విద్యార్థులు తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుకుంటున్నారు. అయితే వీళ్లంతా ఒకటే గదిలో పడుకుంటున్నారు. అయితే ఈ గదిలోని చదువుకోడానికి, నిద్రపోవడానికి, భోజనం చేయడానికీ ఈ గదినే వినియోగిస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. అయితే శ్లాబ్ పూర్తిగా పాడవ్వడంతో గదిలో వర్షం కురుస్తోంది. వర్షం వచ్చిన ప్రతిసారీ విద్యార్థులంతా జాగారం చేయాల్సిందే. విద్యార్థులు పడుకునే మంచాలపై వర్షం పడటంతో కంటిమీద కునుకులేకుండా రాత్రంతా నిరీక్షించాల్సిన దుస్థితి ఉంది. మంచాలు, దుప్పట్లు, పుస్తకాలు, ట్రంకు పెట్టెలు, సామగ్రి సైతం వర్షానికి తడిచిపోతూ కన్పించాయి. వసతి గృహంలో ఉన్న మరుగుదొడ్లలో రెండింటికి తలుపులు లేవు. వీటికి తలుపులు బిగించకుండా ఓ మూలన పెట్టారు. దీంతో విద్యార్థినులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు తప్పట్లేదు. స్థానికంగా ఉన్న డ్రెయినేజీని హాస్టల్ నిర్వాహకులే బాగు చేయించుకుంటున్న పరిస్థితి. అయితే ప్రస్తుతం మరుగుదొడ్ల పనులు రూ.80 వేలతో చేపట్టినట్లు హాస్టల్ అధికారి విజివి.లక్ష్మి తెలిపారు. భవనం శ్లాబ్ లీకేజీ మరమ్మతులకు ప్రతిపాదనలు చేశామన్నారు. అయితే జిల్లాలో అనేక వసతిగృహాల పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. జిల్లావ్యాప్తంగా ప్రజాశక్తి పరిశీలనలో ఇది తేటతెల్లమైంది. భవనాలు శిథిలావస్థకు చేరడం, అద్దె భవనాల్లో కొనసాగడం, మౌలిక సౌకర్యాలు లేకపోవడం, శ్లాబ్ లీక్ కావడం, డ్రెయినేజీ, తాగునీరు వంటి సమస్యలు హాస్టల్ విద్యార్థులను వెంటాడుతున్నాయి.



తలుపులు లేని మరుగుదొడ్లు ఇవే



పూడికపోయిన డ్రెయినేజీ

ప్రజాశక్తి పరిశీలన

అమలుకు నోచుకోని టిడిపి కూటమి హామీలు

ఎన్నికల ముందు టిడిపి కూటమి ప్రభుత్వ వసతి గృహాల రూపురేఖలు మారుస్తామని హామీ ఇచ్చింది. దీనిలో ప్రధానంగా వసతి గృహాలకు శాశ్వత భవనాలు నిర్మిస్తామని, మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చింది. అయితే టిడిపి కూటమి అధికారం చేపట్టి 16 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీల్లో ఏఒక్కటీ అమలు చేయలేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. జిల్లాలో బిసి సంక్షేమ శాఖ పరిధిలో 16 బోయ్స్, 13 గరల్స్ హాస్టళ్లు ఉన్నాయి. సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 15 బోయ్స్, 20 గరల్స్ హాస్టళ్లు ఉన్నాయి. తాడేపల్లిగూడెం రూరల్‌లో ఆరుగొలను, నరసాపురం రూరల్ ఎల్‌బిచర్లలో గురుకుల కళాశాలలు, పెనుగొండలో గురుకుల బాలికల పాఠశాల, తాడేపల్లిగూడెం రూరల్ తాడేపల్లిలో గురుకుల బాలుర పాఠశాల ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఆయా వసతి గృహాల్లో 5,329 మంది విద్యార్థులు విద్యాభ్యాసం సాగిస్తున్నారు. అయితే 32 వసతి గృహాలకు ప్రభుత్వ సొంత భవనాలు ఉండగా మరో 32 వసతి గృహాలు అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. అయితే ఇటీవల రూ.కోటీ 29 లక్షలతో మరమ్మతుల పనులు చేపట్టారు. మరో రూ.కోటితో మరమ్మతు పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. అయితే నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిధులొస్తే తప్ప పనులు ముందుకు సాగే పరిస్థితి లేదు. అయితే ప్రభుత్వం వసతి గృహాలకు భవనాల నిర్మాణం పక్కనపెట్టి మరమ్మతులు చేసేదుకు మాత్రమే మొగ్గు చూపుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ వసతిగృహాల్లోని విద్యార్థులు పడుతున్న అవస్థలు రోజురోజుకీ పెరుగుతున్నాయి.

పారిశుధ్యం, రోడ్ల మరమ్మతులపై కేంద్రీకరించాలి

- పంట నష్టాల సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- జిల్లా అధికారులకు ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశం



మాట్లాడుతున్న నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - ఏలూరు

పారిశుధ్యం మెరుగుదల, రోడ్ల మరమ్మతులపై అధికారులు కేంద్రీకరించాలని, పంట నష్టాల సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలో తుపాన్ అనంతర సహాయక చర్యలపై రాష్ట్ర సచివాలయం నుండి తుపాన్ సహాయక కార్యక్రమాల పర్యవేక్షణ జిల్లా ప్రత్యేక అధికారి కాంతిలాల్ దండే, కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి జిల్లా అధికారులతో మంత్రి టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా వరద నీరు ఎక్కడా నిల్వ లేకుండా చూడాలన్నారు. జిల్లాలో ముఖ్యంగా గిరిజన, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో డ్రెయిన్లలో మురుగు నీరు లేకుండా పూర్తిగా తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు ఎక్కడా కలుషితం కాకుండా చూడాలని, ఎక్కడా అపరిశుభ్ర వాతావరణం లేకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, దోమలు పెరగకుండా ఫాగింగ్ చేయించాలని ఆదేశించారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తుపాన్ కారణంగా జిల్లాలోని రైతాంగం తీవ్రంగా నష్టపోయారని, పంట నష్టపోయిన ప్రతిరైతు వివరాలూ సేకరించాలన్నారు. వ్యవసాయం, ఉద్యానవన, ఆక్వా రైతులు నష్టపోయారని, పంట నష్టాలను రైతువారీగా తీసుకుని నివేదిక సమర్పించాలన్నారు. తుపాన్ కారణంగా దెబ్బతిన్న రోడ్లకు సంబంధించి స్వల్ప, దీర్ఘకాలిక మరమ్మతులపై వెంటనే నివేదిక సమర్పించాలని, స్వల్పకాలంలో చేపట్టాల్సిన రోడ్డు మరమ్మతు పనులను తుపాన్ నిధుల నుండి వెంటనే చేపట్టాలన్నారు. ప్రజల రవాణా సౌకర్యాలకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా రోడ్డు మరమ్మతు పనులను చేపట్టాలన్నారు. పెద్దస్థాయిలో చేయాల్సిన రోడ్డు పనులపై ప్రభుత్వానికి వెంటనే ప్రతిపాదనలు పంపాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్‌డిఒలు అచ్యుత్ అంబరీష్, రమణ, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్థక, మత్స్య, రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో, వైద్యఆరోగ్య తదితర శాఖల అధికారులు, తహాశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సిపిఎం బృందాల డిమాండ్

ప్రజాశక్తి - నిడమర్రు

మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు, వీచిన గాలులకు పంట నష్టపోయిన రైతులను, కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. మండలంలోని అడవికొలను, భువనపల్లి గ్రామాల్లో ఆయకట్టు పంట నష్టపోయిన రైతులను సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం పరామర్శించారు. పడిపోయిన వరి చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా రమణరావు మాట్లాడుతూ తుపాన్ ప్రభావం వల్ల రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం పంట నష్టాన్ని పరిశీలించి రైతులకు పరిహారం అందించాలన్నారు. 80 శాతం ఉన్న కౌలు రైతులు పెట్టుబడులు పెట్టి తుపాన్ ప్రభావం వల్ల తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం పరిశీలించి పంట నష్టపోయిన కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం అధ్యక్షులు వెలగలేటి మోహన, కార్యదర్శి లావేటి సోంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చంద్రరావు, సంకు కోటి శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.



వరిచేలను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

బుట్టాయిగూడెం: మొంథా తుపాను వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం బుట్టాయగూడెం మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. తుపాన్ ప్రభావంతో రెడ్డి గణపవరంలో నేలకొరిగిన వరి చేలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు మాట్లాడుతూ తుపాను ప్రభావం వల్ల నష్టపోయిన పంటలను అంచనా వేసి నష్టపరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, మండల కమిటీ సభ్యులు పోలోజు నాగేశ్వరరావు, కొరస జలపాలు, వేటి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

చింతకాయల బాబూరావు మృతి తీరని లోటు

సిపిఎం జిల్లా కమిటీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిపిఎం నాయకులు చింతకాయల బాబూరావు హఠాన్మరణానికి దిగ్భ్రాంతి తెలుపుతూ ఆయన మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ తరుపున తెలిపినట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ప్రకటనలో తెలిపారు. తాడేపల్లిగూడెంలో రైస్ మిల్లుల్లో డ్రైవర్‌గా పనిచేస్తూ సిఐటియు యూనియన్‌లో చేరి సిపిఎం సిద్ధాంతాలకు ఆకర్షితులై ఆయన సిఐటియు, సిపిఎం నాయకులుగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పనిచేశారని తెలిపారు. సిపిఎం అప్ ల్యాండ్ జిల్లా, జిల్లాల విభజన తర్వాత ఏలూరు జిల్లా కార్యదర్శిగా, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఆయన పనిచేశారని తెలిపారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా పార్టీ బాధ్యతలకు ఆయన బదిలీ అయ్యారని పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో రైతు సంఘం బాధ్యతలను ప్రస్తుతం ఆయన చూస్తున్నారని తెలిపారు. అనారోగ్య కారణాల వల్ల రాజమండ్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన గురువారం మధ్యాహ్నం మృతి చెందారని తెలిపారు. ఆయన మృతి పార్టీకి, సిఐటియుకు, రైతు రంగానికి తీరని లోటని తెలిపారు. ఆయన హఠాత్ మరణానికి సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బాబూరావు మరణ వార్త దిగ్భ్రాంతి కలిగించింది

చింతకాయల బాబూరావు మరణ వార్త తనకు దిగ్భ్రాంతిని కలిగించిందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాంచీలో జరుగుతున్న గిరిజన సంఘం అఖిల భారత సమావేశంలో ఉండగా బాబూరావు మరణ వార్త తీవ్రమైన దిగ్భ్రాంతిని కలిగించిందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఉద్యమ దశ నుంచే ఆయనతో తనకు సన్నిహిత అనుబంధం ఉందని పేర్కొన్నారు.

చింతకాయల బాబూరావు మరణం గ్రామీణ పేదల ఉద్యమానికి, కార్మిక ఉద్యమానికి తీరని లోటని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన నమ్మిన సిద్ధాంతం కోసం అంకితభావంతో పనిచేసిన నాయకులు అని తెలిపారు.

చింతకాయల బాబూరావు మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటు అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వారి ఆశయాలను సాధించడమే ఆయనకు అందించే అసలైన నివాళి అని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సిపిఎం సీనియర్ నాయకులు, సిఐటియు జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు ఆకాల మృతికి సిపిఐ జిల్లా సమితి సంతాపం తెలిపింది. ఈ మేరకు సిపిఐ జిల్లా సమితి కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఏలూరు : బాబూరావు మృతి తీరని లోటని సిఐటియు జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గణపవరంలో రైస్ మిల్లు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు చేసి కార్మికులకు చట్టబద్ధంగా రావాల్సిన హక్కులు సాధించారని తెలిపారు.

చింతకాయల బాబూరావు మరణం తీరని లోటని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. బాబూరావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు పేర్కొంది.

కుక్కునూరు రూరల్ : చింతకాయల బాబూరావు మరణం కార్మికుల పోరాటాలకు తీరని లోటని సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ అన్నారు. కార్మిక వర్గం, దోపిడీకి గురయ్యే ప్రజల సంక్షేమానికి కట్టుబడిన నేత బాబూరావు అని కొనియాడారు.

వికలాంగుడికి కృత్రిమ కాలు అందజేత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి


కృత్రిమ కాలు అందిస్తున్న ఎంపిడిఒ

తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలతో పాటు దారిద్ర్యరేఖకు దిగువన ఉండి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వందలాది మంది పిల్లలకు ఉచితంగా విద్య, వైద్యం, వసతి కల్పించి వారికి ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్య అందించడం ఎంతో అభినందనీయమని ఎంపిడిఒ బి.భార్గవి అన్నారు. మండల పరిధిలోని హీల్ స్కూల్‌లో ప్రముఖ దంత వైద్యులు గూడూరు విజయ్ శ్రీనివాస్ షష్ఠిపూర్తి సందర్భంగా అందించిన విరాళంతో ఏలూరుకు చెందిన వికలాంగుడు తరగళ్ల రాజేష్‌కు ఆమె కృత్రిమ కాలును అందించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ అంధ విద్యార్థులకు సాధారణ విద్య, బ్రెయిలీ లిపి, కంప్యూటర్ విద్య, సంగీత శిక్షణ అందించడమే కాకుండా వికలాంగులకు ఉచితంగా కృత్రిమ కాళ్లను అందిస్తున్న హీల్ సంస్థ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హీల్ సిఇఒ కె.అజయ్‌కుమార్, దంతవైద్యులు జి.విజయ్ శ్రీనివాస్, నీరజ దంపతులు, నరశింగపాలెం పంచాయతీ కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్, సీనియర్ టెక్నీషియన్ కె.చిన్నా పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, అధికారులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు

అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి

ప్రజాశక్తి - ముదినేపల్లి



మొంథా తుపాన్‌తో ఎటువంటి ప్రాణం నష్టం జరగకుండా, పంట నష్ట తీవ్రత తగ్గించడానికి ప్రభుత్వం, అధికారులు చేసిన కృషి అభినందనీయమని అమరావతి బ్రాండ్ అంబాసిడర్ (వైద్య విద్యార్థిని) అంబుల వైష్ణవి అన్నారు. ముదినేపల్లిలో గురువారం వైష్ణవి మాట్లాడుతూ నెల్లూరు నుంచి విజయనగరం వరకు తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో శ్రమించిన ప్రభుత్వానికి, కలెక్టర్లకు, మంత్రులకు, శానిటేషన్ సిబ్బందికి, డాక్టర్లకు, రెవెన్యూ సిబ్బందికి, పునరావాస కేంద్రాలు ఏర్పాట్ల విషయంలో సహకరించిన అందరికీ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వరదల వల్ల పునరావాస కేంద్రాలకు తరలించిన వారికి 25 కేజీలు బియ్యం, రూ.మూడు వేల నగదు ఆర్థిక సహాయం ముందస్తుగా ఏర్పాటు చేసి, భోజన, వసతులు కల్పించిన ప్రభుత్వ అధికారులందరికీ అంబుల వైష్ణవి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు నిర్మించాలని వైసిపి నిరసన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు పరిధిలోని వంగాయగూడెం నుంచి పెదపాడు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గోతులు పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న కూటమి నాయకులు పట్టించుకోవడంలేదని వైసిపి ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ విమర్శించారు. ఏలూరులోని వంగాయగూడెం ప్రధాన రహదారిలో గోతులు చూపిస్తూ వైసిపి నాయకులు గురురవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఈ ప్రధాన రహదారిని పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షుడు గుడిదేశీ శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి నూకపెయి సుధీర్‌బాబు, జిల్లా అధికార ప్రతినిధి జాన్ గురునాథ్, నగర మహిళా అధ్యక్షురాలు జుజ్జువరపు విజయనిర్మల, నాయకులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్‌లకు ఇన్‌లైన్ క్లోరినేషన్ సిస్టమ్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వాటర్ ట్యాంకుల్లో బాక్టీరియా, సూక్ష్మ జీవులను నిర్మూలించేందుకు ఇన్‌లైన్ క్లోరినేషన్ సిస్టమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ తెలిపారు. దీనిలో భాగంగా జల జీవన్ మిషన్ పథకం నుంచి మండలంలోని 16 గ్రామాలను గుర్తించినట్లు తెలిపారు. వీటిలో దర్భగూడెం పంచాయతీలోని లక్ష్మీపురం, తపస్వి వారిగూడెం, పండువారిగూడెం, పి.అంకంపాలెం పంచాయతీలోని టేకూరు, చీడురు ఆర్అండ్ఆర్ కాలనీలతో పాటు పి.నారాయణపురం గ్రామాల్లో ప్రక్రియ పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సున్నం ఉషారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వినయ్ కుమార్, క్లోరినేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన

ఏలూరు సిటీ : ఏలూరు ప్రాజెక్టు పరిధిలోని వెంకటాపురం 2 సెక్టార్లలోని హనుమాన్ నగర్, సాయినగర్ అంగన్వాడీ కేంద్రాలను రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.సుజాతరాణి బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న తల్లులు, పిల్లలు పౌష్టికాహారం ఏ విధంగా తీసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. తల్లులందరికీ నవ చేతన కార్యక్రమం గురించి వివరించారు. అనంతరం రైన్ వాటర్ హార్వెస్టింగ్‌ను తనిఖీ చేశారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మొంథా తుపాన్ ప్రభావంతో జిల్లాలో పంటలు దెబ్బతిని అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారని, నష్టపోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ తరుపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తుపాన్ తీరం దాటిన తరుణంలో వీచిన ఈదురు గాలులు, కురిసిన వర్షాల వల్ల తీవ్రంగా పంటలు దెబ్బతినిరైతాంగం నష్టపోయారని తెలిపారు. జిల్లాలో వరి 6075 ఎకరాల్లో, మినుములు 881.2 ఎకరాల్లో, వేరుశనగ 67 ఎకరాల్లో, ప్రత్తి 897.2 ఎకరాల్లో ఉందని వేశారని పేర్కొన్నారు. తుపాన్ ప్రభావం దాదాపుగా 281 గ్రామాల్లో ఉందని, 9567 మంది రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తుపాన్ వలన 20 వేలకు పైగా ఎకరాల్లో వివిధ పంటలు నష్టపోయారని, ముఖ్యంగా వరి పంట విషయంలో ఉంటే గింజ గట్టిపడే, ఈనిక దశలో నేలకొరగడంతో వరి రైతులు భారీగా నష్టపోయారని తెలిపారు.ప్రమాద స్థాయిలో కొల్లేరు, ఉప్పుటేరు ప్రవహించడం వల్ల ఈ నష్టం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కేవలం పంటల నష్టం లోనే కాకుండా ఆక్వా చెరువుల్లో ఆక్సిజన్ లెవెల్స్ పడిపోయి ఆక్వా రైతాంగం కూడా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. వెంటనే జిల్లా అధికారులు ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తుపాన్ ప్రభావం వల్ల జిల్లాలో రైతాంగానికి జరిగిన నష్టం విషయంలో యుద్ధ ప్రాతిపదికన సర్వే నిర్వహించి కచ్చితమైన లెక్కలు తీయాలని, నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని పేర్కొన్నారు. నేలకొరిగిన చెట్లను తొలగించడంతోపాటు అంతరాయం కలిగిన చోట్ల విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని, పాడైపోయిన రోడ్ల మరమ్మతులు చేయడంతో పాటు పూర్తిగా పాడైపోయిన రోడ్లను తిరిగి నిర్మించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇలాంటి తరుణంలో అంటు వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో వైద్యారోగ్యశాఖ అప్రమత్తంగా ఉంటూ ఏజెన్సీ, గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు.

ప్రతి రైతునూ ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

జిల్లావ్యాప్తంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

నష్టపరిహారం అందించాలని కోరిన అన్నదాతలు

అందిస్తామని హామీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్


పంట పరిశీలిస్తున్న కలెక్టర్

మొంథా తుపాన్ వల్ల నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని, ఎవరూ అధైర్యపడొద్దని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. మండలంలోని రామన్నగూడెంలో, తుక్కులూరు ఆమె గురువారం పర్యటించారు. రామన్నగూడెంలో దెబ్బతిన్న మినుము పంటలు, సీడ్ కాటన్ సాగు, తుక్కులూరులో డ్యామేజీ అయిన రామిలేరు బ్రిడ్జిని పరిశీలించారు. తుక్కులూరు కమ్యూనిటీ భవనంలో పునరావాస కేంద్రంలో ఐదు బాధిత కుటుంబాలకు 25 కేజీలు బియ్యం, నిత్యావసర సరుకులు, నగదు పంపిణీ చేశారు. మీర్జాపురంలో నేలకొరిగిన వరి పొలాలను సంబంధిత అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. సీడ్ కాటన్ సాగు రైతులు, మినుము, వరి రైతులు కలెక్టర్‌కు వారి సమస్యలను వివరించారు. తుక్కులూరులో డ్యామేజీ అయిన రామిలేరు బ్రిడ్జి సమస్యను ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్రిడ్జికి తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. రానున్న రోజుల్లో శాశ్వత బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. తుపాన్ వల్ల నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. పునరావాస కేంద్రాల నుంచి తిరిగి ఇంటికి వెళ్లే కుటుంబాలకు 25 కేజీలు బియ్యం, నిత్యావసర సరుకులు, కుటుంబానికి రూ.మూడు వేల నగదు పంపిణీ చేశామని తెలిపారు.

దెందులూరు :మొంథా తుఫాను అన్నదాతలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని, పంట నష్టాల నమోదు నిబంధనలు సడలించి వాస్తవ సాగుదారుల పేర్లను నమోదు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం పెదపాడు మండలంలోని వట్లూరు, పెదపాడు గ్రామాల్లో పర్యటించి పంట నష్టాలను పరిశీలించారు. తాలు గింజలు తయారయ్యి దిగుబడులు తగ్గిపోతాయంటూ కౌలు రైతులు రైతు సంఘం నాయకుల ముందు వాపోయారు. తమను ఆదుకోకపోతే ఆత్మహత్యే శరణ్యం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పంటలకు ఏ మేరకు నష్టం జరిగితే ఆ మేరకు పంట నష్టాలు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుమ్మల ధన కోటేశ్వరరావు, కొమ్మన సాంబశివరావు, యాదాల అబ్రహం, నేర్సు కొండలరావు, నందివాడ స్వామి, పి.నాని, జి.కృష్ణారావు, చలమాల మంగేశ్వరరావు, పల్నాటి బాలు, జి.తంబి, పి.కిషోర్, పి.అగస్టిన్, తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి :పొలాల్లోకి చేరిన నీటిని వీలైనంత మేరకు బయటకు తోడేయాలని వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పెరికెగూడెంలో మొంథా తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వరి పొలాలను రైతులతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 4250 ఎకరాల్లో వరి సాగవ్వగా 1352 ఎకరాలు నేలవాలిందన్నారు. వరి గింజ పోసుకునే దశలో ఉన్న పొలాల్లో ఉన్న నీటిని బయటకు తోడేయాలని చెప్పారు.

ద్వారకాతిరుమల :మండలంలోని పంగిడిగూడెంలో ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు బృందం పర్యటించింది. నష్టపోయిన అరటి పంటలను సందర్శించి పలు సూచనలు చేశారు. 75 శాతం వరకు పక్వానికి వచ్చి విరిగిన అరిటి గెలలను ఆకుల కప్పి సంరక్షించుకోవాలని, గెలలపై 13.0.45 ఎరువు లీటరుకు ఐదు గ్రాములు చొప్పున పిచికారీ చేసి కొంతమేర గెలలు మార్కెట్ చేసుకోవచ్చని తెలిపారు.


రైతులతో మాట్లాడుతున్న నేతలు

ఉంగుటూరు :తుపాను కారణంగా ఉంగుటూరు మండలం అక్కుపల్లి గోకవరంలో అరటి, కొబ్బరితోటలకు నష్టం వాటిల్లింది. ఉద్యానవన శాఖ శాస్త్రవేత్త డాక్టర్ రవికిరణ్, హార్టికల్చర్ అధికారి అమరనాథ్ పడిపోయిన పంటలను పరిశీలించి రైతులకు సస్యరక్షణ జాగ్రత్తలను వివరించారు.

జంగారెడ్డిగూడెం : మొంథా తుపాన్ ప్రభావంతో మండలంలో సుమారు 536 ఎకరాల వరి పంట రైతుల నష్టపోయారని, 15 ఎకరాల మినుములు పాడైపోయాయయని మండల వ్యవసాయాధికారి సి.పవన్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని తెలిపారు. వర్షం కారణంగా పంటకు తెగులు రాకుండా ఉండేందుకు వ్యవసాయ శాస్త్రవేత్త పి.ఫణికుమార్ రైతులకు కొన్ని సూచనలు చేశారు.

ముసునూరు :తుపాను ప్రభావం వల్ల మిర్చి, వరి, పత్తి పంటలకు బాగా నష్టం వాటిల్లిందని టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు అన్నారు. మండల పరిధిలోని ముసునూరు, వలసపల్లి, గుడిపాడు గ్రామాల్లో ఉద్యానవన అధికారి హేమ, వ్యవసాయ అధికారి ఎ.చాముండేశ్వరి ఆధ్వర్యంలో మిర్చి, వరి, పత్తి పంటలను పరిశీలించారు. ఆయనతో పాటు పార్టీ గ్రామ అధ్యక్షులు మెదరమెట్ల సురేంద్ర, వలసపల్లి సొసైటీ ఛైర్మన్ కొల్లి కృష్ణయ్య, రైతులు పాల్గొన్నారు.

పోలవరం : పోలవరం మండలంలో గురువారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి ప్రగడపల్లి పంచాయతీ రేపల్లెవాడ గ్రామంలో పలు రైతుల పంటలు నష్టపోయాయి. నేలకు ఒరిగిన వరి, తడిసిన మినుప పంట దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో జగదీశ్వరి మాట్లాడుతూ మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులు ఎవరు అధైర్య పడొద్దని, ప్రభుత్వం ఎప్పుడు రైతులకు అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

పంట నష్టం లెక్కించడానికి ఏర్పాట్లు

మొంథా తుపాన్ ప్రభావంతో పోలవరం మండలంలో పంటలకు జరిగిన నష్టాన్ని లెక్కించడానికి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో తహశీల్దార్ బి.సాయిరాజు, ఎంపిడిఒ సిహెచ్.శ్రీనివాస్‌బాబు, వ్యవసాయాధికారి కె.రాంబాబు సంయుక్త ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు గురువారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మండలాన్ని పది బృందాలుగా విభజించి క్షేత్రస్థాయిలో పంట నష్టపరిహారం చేపట్టాలని సూచించారు. జాబితాను అక్టోబర్ 31వ తేదీలోపు పూర్తి చేసి రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పెరిగిన గోదావరి నీటిమట్టం

1,53,297 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - పోలవరం

తుపాను ప్రభావంతో ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉపనదులు కలుస్తుండడంతో గోదావరి నీటిమట్టం గురువారం పెరిగింది. ప్రాజెక్టు నుంచి 1,53,297 క్యూసెక్కుల జలాలను జలవనరులశాఖాధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 27.620 మీటర్లు, దిగువన 17.820 మీటర్లు, ఎగువ కాపర్ డ్యాం ఎగువన 27.720 మీటర్లు, దిగువ కాపర్ డ్యాం దిగువన 16.840 మీటర్లు, ఎగువ దిగువ కాపర్ డ్యామ్‌ల మధ్య 16.200 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

పూర్తిస్థాయిలో శానిటేషన్ పనులు

ప్రజాశక్తి - మండవల్లి

మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు వ్యాధులు ప్రబలకుండా పూర్తిస్థాయిలో శానిటేషన్ పనులు నిర్వహిస్తున్నామని సర్పంచి మెండ రూన్సీ తెలిపారు. మండల కేంద్రమైన మండవల్లిలో పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో సిబ్బంది నిర్వహిస్తున్న శానిటేషన్ క్లోరినేషన్ పనులను ఆమె గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గిరిజ మెండా సురేష్, ఎఎన్ఎం, ఆశావర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

నిరుపేద మహిళ అంత్యక్రియలకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి గురువారం ఆర్థిక సాయం అందించారు. ముదినేపల్లి అంబేద్కర్ కాలనీకి చెందిన గోన మాధవి (35) అనే నిరుపేద వికలాంగ మహిళ అనారోగ్య సమస్యలతో చాలా కాలంగా బాధపడుతూ మరణించింది. ఆమె భర్త భార్య పిల్లల్ని విడిచి వేరుగా ఉంటున్నాడు. మాధవి మృతి వార్త తెలుసుకున్న అంబుల వైష్ణవి విషయం తన తండ్రి డాక్టర్ మనోజ్‌కు చెప్పారు. దీంతో డాక్టర్ మనోజ్ మాధవి మృతదేహాన్ని సందర్శించి అంజలి ఘటించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియలు నిమిత్తం మాధవి తల్లికి రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందించారు. మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

బాధిత కుటుంబానికి డిఎన్ఆర్ పరామర్శ

ప్రజాశక్తి - మండవల్లి

చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడం తీరని బాధను మిగులుస్తుందని మాజీ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. కరెంటు పనులు నిర్వహిస్తూ ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన చిగురుపాటి సుకుమార్ (చంటి) కుటుంబ సభ్యులను ఆయన పలువురు నాయకులతో కలిసి గురువారం పరామర్శించారు. పెదపాడు మండలం ఏపూరులో కరెంటు స్తంభంపై మరమ్మతులు చేస్తూ ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై మా కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు ఆయన వద్ద కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతికి అందించిన కొడుకు మృతి చెందడం ఎంతో బాధాకరమన్నారు. ఆయనతో పాటు ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, కానుకొల్లు సర్పంచి నాగ దాసి థామస్, వైసిపి మండలాధ్యక్షుడు బేతపూడి ఏసేబురాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ చేబోయిన వీర్రాజు, సొసైటీ మాజీ అధ్యక్షులు బొమ్మన బోయిన గోకర్ణ యాదవ్, మెండ సురేష్, తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

మొంథా తుపాన్ బాధితులకు కుటుంబానికి 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను గురువారం చేబ్రోలులో ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అందించారు. సర్పంచి రాంథేలక్ష్మీసునీత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఎ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తుపాను ప్రభావంతో ముందస్తు చర్యలు తీసుకోవడం వల్లే ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలి గామన్నారు. బాధితులకు ప్రభుత్వం బియ్యం, నిత్యావసర సరుకులను పంపించగా వాటిని 13 కుటుంబాల లబ్ధిదారు లకు అందించారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్ వై.పూర్ణచం ద్రప్రసాద్, ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్, ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి, చేబ్రోలు కార్యదర్శి కె.శ్రీనివాసరావు, హౌసింగ్ ఎఇ చింతల పూడి సతీష్, నారాయణపురం సొసైటీ ఛైర్మన్ కడియాల రవిశంకర్, టిడిపి మండలాధ్యక్షుడు వేములపల్లి సుధీర్, నాయకులు అయ్యప్ప, రాంబాబు, రాజారావు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : మొంథా తుపాన్ ప్రభావంతో ఏలూరు పరిసర ప్రాంతాలు వరద ముప్పు చుట్టుముట్టిన నేపథ్యంలో బాధిత ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని 47 డివిజన్‌లో బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

జీలుగుమిల్లి :తుపాన్ ప్రభావం కారణంగా పునరావాస కాలనీలో ఉంటున్న సంచార కుటుంబాలకు నిత్యావసర సరుకులతో పాటు ఆర్థిక పరిహారం పంపిణీ చేసినట్లు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పునరావాసంలో ఉంటున్న 13 మంది సంచార కుటుంబాలకు నిత్యావసర సరుకులతో పాటు రూ.మూడు వేలు ఆర్థిక పరిహారం పంపిణీ చేసినట్లు తెలిపారు.

చింతలపూడి :స్థానిక ఫైర్ స్టేషన్‌లో పునరావాస శిబిరాల్లో ఉన్నవారికి సిఎం చేయూత కిట్స్ చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పోలవరం : మొంథా తుపాన్ కారణంగా నష్టపోయిన పోలవరం మండలంలోని ప్రగడపల్లి పంచాయతీ గుంజవరం గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున సహాయాన్ని అందించారు. ప్రగడపల్లి సర్పంచి కలుం బాపిరాజు చేతుల మీదుగా ఏడు కుటుంబాలకు నిత్యావసరాలు అందించారు. అదనంగా 12 మంది బాధితులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.12 వేలు అందించారు.

భారీ వర్షానికి పొంగి పొర్లుతున్న కాలువలు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండలంలో గురువారం తెల్లవారుజామున ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి రేపల్లెవాడ, తానాలగుంట, గుంజవరం ప్రాంతాల్లోని కాలు వలు పొంగిపొర్లుతున్నాయి. రాత్రి నుంచి ఉదయం వరకు కురిసిన వానతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గుంజవరం వద్ద వరి పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లే రహదారులపై వాగులు పొంగిపోవడంతో వాహన రాకపోక లు నిలిచిపోయాయి. రేపల్లెవాడ, గుంజవరం, గార్ల గొయ్యి, బోడుగూడెం వెళ్లే రోడ్డు మార్గంలో కల్వర్టు పూర్తిగా దెబ్బతి నడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు.

5, 6 తేదీల్లో వ్యకాస జిల్లా మహాసభ

ప్రజాశక్తి - టి.నరసాపురం

నవంబర్ 5, 6 తేదీల్లో టి.నరసాపురంలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద వ్యకాస ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మూడేళ్లకు ఒకసారి జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభ టి.నరసాపురం మండలంలో మొట్టమొదటి సారిగా ఎస్ఎస్.కళ్యాణమండపంలో జరుగుతున్నట్లు తెలిపారు. ఈ సభకు వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. నవంబరు 5న మండల కేంద్రంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. మండలంలో మొట్టమొదటి సారిగా జరుగుతున్న ఈ సభకు మండల, పట్టణ ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పిల్లి రామకృష్ణ, గుడెల్లి వెంకట్రావు, సిరిబత్తుల సీతారామయ్య, కిరణ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ విధానంతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - ముసునూరు

చెత్త సేకరణ విధానం గ్రామాలు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి దోహదపడుతుందని జెడ్‌పి సిఇఒ శ్రీహరి అన్నారు. మండల పరిధిలోని వలసపల్లిలో ఎంపిడిఒ పిల్లి ఏసుబాబు, ఉప ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ ఆధ్వర్యంలో చెత్త సేకరణ విధానాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు గ్రామంలో డోర్ టు డోర్ చెత్త సేకరణ విధానం అమలు చేయాలని, తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని సూచించారు.

రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి - పోలవరం

మొంథా తుపాన్ ప్రభావంతో మండలంలోని వరి, మినుము, పత్తి, కూరగాయ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, సమగ్ర సర్వే నిర్వహించి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏజెన్సీ గిరిజన సంఘం రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో పోలవరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ భాషా మాట్లాడుతూ కూలీలకు పనిలేక ఇబ్బందులు ఎదురవుతున్నందున రూ.రెండు వేల సాయం, ఉచిత నిత్యావసర సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి రామారావు మాట్లాడుతూ మండలంలో సుమారు ఐదు వేల ఎకరాల పంటలు నష్టపోయాయని, తక్షణమే సమగ్ర సర్వే జరిపి ఆదివాసీ రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. సవలం రాంబాబు, కొమరం రామారావు మాట్లాడారు.

హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదు

ప్రజాశక్తి - టి.నరసాపురం

భార్యను హత్య చేసిన సంఘటనలో నేరం నిరూపణ కావడంతో నిందితుడు కోడూరి మణికంట స్వామి(29)కి ఏలూరు జిల్లా కోర్టు రెండో అడిషనల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి యు.ఇందిరా ప్రియా దర్శిని జీవిత ఖైదు శిక్షను విధించినట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... టి.నరసాపురానికి చెందిన కోడూరి మణికంట మద్యానికి, ఇతర వ్యసనాలకు బానిసై అతని భార్య కోడూరి జీవన జ్యోతి(27)ని అనుమానిస్తూ, మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. ఈ నేపథ్యంలో 2019లో ఇరువురికి వాగ్వాదం జరిగిన సమయంలో అల్యూమినియం టెలిఫోన్ క్రాస్ రాడ్‌తో భార్య తలపై బలంగా కొట్టగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ కేసులో అప్పటి చింతలపూడి సిఐ పి.రాజేష్ దర్యాప్తును పూర్తిచేసి ఛార్జ్ షీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి జిల్లా రెండో అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జ్ యు.ఇందిరా ప్రియా దర్శిని రూ.వెయ్యి జరిమానాతో పాటు జీవిత ఖైదు విధించారని తెలిపారు.

పునరావాస బాధితులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - చింతలపూడి

మొంథా తుపాన్ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పునరావాస కేంద్రాలకు తరలించిన బాధితులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ పి.పాండురంగారావు ఉన్నతాధికారులను కోరారు. గురువారం నిర్వహించిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో ఆ పార్టీ మండల కన్వీనర్ పి.పాండురంగారావు మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జిఒ ద్వారా పునరావాస కేంద్రంలో ఉన్నవారికి రూ.మూడు వేలు అందించాలని కోరారు. చింతలపూడి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఉన్నవారికి ఈ నెల 29వ తేదీ రాత్రి ఏడు గంటలకు భోజనాలు ఏమి ఏర్పాటు చేయకుండా వారి నివాసాలకు వెళ్లిపొమ్మని ఆదేశించడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు దేవగురు సత్యనారాయణ, కె.అనురాధ, ఎం.వరలక్ష్మిదేవి, సులేమాన్, సిపిఎం పట్టణ కార్యదర్శి సూర్యకుమార్ పాల్గొన్నారు.

బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముసునూరు

తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి మండలంలోని గుడిపాడు గ్రామంలో మందలపు గంగాధర్ ఇల్లు కూలిపోయింది. బాధితులకు టిడిపి మండలాధ్యక్షులు రఘుబాబు అధికారులతో కలిసి గురువారం పరామర్శించారు. అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేసి, రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షులు మందలపు ధర్మరాజు, టిడిపి నాయకులు కొల్లి గంగారం, సొసైటీ అధ్యక్షులు కొల్లి కృష్ణయ్య, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.